

మట్టికుప్పలు, చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

బతుకమ్మకుంటలో మట్టికుప్పల తొలగింపు

నల్లకుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మ కుంట, మధురనగర్ కాలనీలో గురువారం కురిసిన భారీ వర్షానికి మట్టికుప్పలు, చెత్త చేరడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. కార్పొరేటర్ వెంటనే జీహెచ్‌ఎంసీ బాబ్కట్ మిషన్ వాహనంతో అధికారులు, సిబ్బందిని రప్పించి మట్టి, చెత్తకుప్పలను తీసివేయించి ప్రజల ఇబ్బందులను తొలగించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హరినాథ్, రవి, లక్ష్మణ్, సుధాకర్ స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- పీడీఎస్‌యు నేతల డిమాండ్

నల్లకుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 30న విడుదలై నేటికి 20 రోజులు గడిచిపోయినా ఇప్పటి వరకు ట్రిబుల్ ఐటీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడంలో గల అంతర్యం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పష్టం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి. శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫలితాలు విడుదలయ్యాక వెంటనే నోటిఫికేషన్ ఇస్తే ట్రిబుల్ ఐటీలో అనేక మంది పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసి వారికి న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

22 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 30వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. 22న ఉత్సవాల ప్రారంభం, 26న శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవం, 27న గరుడ వాహనసేవ, 28న స్వామివారి శృంగార రథోత్సవం, 30న ఉదయం 81 కలశాలతో స్వామివారి ఘటాభిషేకం, రాత్రి 7 గంటలకు స్వామివారి శృంగార డోలోత్సవం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణ

బర్కత్‌పుర, మే 17 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణ చేస్తున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. అప్పటి జనాభాకు అనుగుణంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైప్‌లైన్లు పెరిగిన జనాభాకు సరిపోవడం లేదని పాతవాటి స్థానంలో కొత్త పైప్‌లైన్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నింబోలి అడ్డ లాల్‌బహదూర్ హైస్కూల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, రమాదేవి, వెంకటేష్, ఆర్.సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

9 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

బర్కత్‌పుర, మే 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నింబోలిఅడ్డ మౌలానాఆజాద్‌నగర్‌కు చెందిన షాహీఉద్దీన్ (26) రేషన్ బియ్యం అక్రమంగా సరఫరా చేస్తున్నాడు. గురువారం రాత్రి అశోక్ లీలాండ్ వాహనంలో 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు నింబోలిఅడ్డ ట్రాఫిక్ పీఎస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని షాహీఉద్దీన్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.



అంబేడ్కర్ నగర్‌లో రోడ్డుపైనే సామగ్రి

అంబేడ్కర్‌నగర్‌లో రోడ్డును ఆక్రమించి వ్యాపారం

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ముషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్‌లో చిరువ్యాపారులు రోడ్లపైనే ప్లాస్టిక్ సంచులను నిల్వ ఉంచి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీంతో ఆ రోడ్డు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లపైనే తూకం వేసి ఆ సంచులను అక్కడే నిల్వ ఉంచడంతో రోడ్డు ఆక్రమనకు గురికావడంతో పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. రోడ్లపై ఉన్న సామగ్రిని తొలగించాలని స్థానికులు చిరు వ్యాపారులకు సూచిస్తే గొడవలకు దిగుతున్నారని వాపోతున్నారు. ఇరుకు రోడ్లపై వ్యాపారం చేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

చర్యలు తీసుకుంటాం: ట్రాఫిక్ సీఐ

రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం తెలిపారు. తమ సిబ్బంది ఆ స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారన్నారు.



సుందరయ్యపార్కులో నిలిచిన వర్షం నీరు

వర్షపు నీటిని వెంటనే తొలగించాలి

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు గురువారం కురిసిన భారీ వర్షానికి దెబ్బతింది. వర్షంనీరు వాకింగ్ ట్రాక్‌లో మోకాలిలోతు నిలిచింది. ఇటీవల లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ దెబ్బతిన్నది. ప్రజలు వాకింగ్ చేయడానికి వీల్లేకుండా పోయింది. వర్షం పడితే నీరు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోకపోవడంతో వాకింగ్ ట్రాక్ దెబ్బతిన్నదని దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని పలువురు వాకర్స్ ఆరోపించారు. వర్షం పడితే సుందరయ్య పార్కులో నీరు నిలిచిపోకుండా సాఫీగా బయటకు వెళ్లేలా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, హైదరాబాద్ జిందాబాద్ సంస్థ కార్యదర్శి వీరయ్య కోరారు.

ఎన్టీఆర్ స్టేడియంలో వ్యర్థాల కుప్పలు

- వాహనాల అక్రమ పార్కింగ్
- నిరుపయోగంగా మూత్రశాలలు
- దుర్వాసనతో క్రీడాకారుల ఇబ్బందులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఎన్టీఆర్ స్టేడియంలో పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తాచెదారం

కవాడిగూడ, మే 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులు ఉదాసీనత, సిబ్బంది నిర్లక్ష్యంతో క్రీడాకారులతో నిత్యం కళకళలాడే ఎన్టీఆర్ స్టేడియం ప్రస్తుతం మట్టికుప్పలు, చెత్తకుప్పలతో దర్శనమిస్తుంది. వేసవిలో జంటనగరాల నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్‌తో పాటు వివిధ రకాల ఆటలు ఆడుకోవడానికి వచ్చే యువకులకు, చిన్నారులకు మట్టికుప్పలు దర్శనమిస్తున్నాయి. ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడలతో పాటు వివిధ కార్యక్రమాలలో పాల్గొనే వారికోసం నాలుగు టాయిలెట్లను నిర్మిస్తే నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. భవన నిర్మాణ యజమానులు తమ ఇళ్లను కూల్చివేసినప్పుడు జీహెచ్‌ఎంసీ అనుమతితో స్క్రాబ్, మట్టి కుప్పలను జీహెచ్‌ఎంసీ అధికారులు చూపించిన ఖాళీ స్థలాల్లో డంప్ చేయాల్సి ఉండగా క్రింది స్థాయి అధికారులు, సిబ్బంది మామూళ్లు తీసుకొని ఎన్టీఆర్ స్టేడియంలో వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. ఈ విషయంపై ప్రజలు, క్రీడాకారులు సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో మట్టికుప్పలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎన్టీఆర్ స్టేడియంకు సెక్యూరిటీ సిబ్బందిని పెడితే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. నాలుగు గేట్ల దగ్గర ఏర్పాటు చేసిన మూత్రశాలలకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.



అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

అక్రమంగా వాహనాల పార్కింగ్

ఎన్టీఆర్ స్టేడియంలో ఎలాంటి నిర్వహణ లేకపోవడంతో ఎక్కడ చూసినా అక్రమంగా కార్లు, ఆటోలు, లారీలు పార్కింగ్ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కూడా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాల్లో మందుబాబులు మద్యం తాగుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి మట్టికుప్పలు తొలగించడంతో పాటు దోమలగూడ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే..

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

బర్కత్‌పుర, మే 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోకు కట్టుబడి ఉండాలని కోరారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు జరిపితే అడ్డుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాలు, 30 బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించిందని, దానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కులాల వారీగా లెక్కలు సేకరించిన తర్వాత విద్య, ఉద్యోగ రంగాలలో బీసీ రిజర్వేషన్లను 50 శాతం పెంచాలని, క్రీమీలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు దానకర్ణచారి, నీల వెంకటేష్, కోల జనార్దన్, నందగోపాల్, రామకృష్ణ, ఆశీష్‌గౌడ్, అభినవ్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, ప్రణీతరాణి, శివమ్మ, రఘుపతి, వినోద్, వేణుగోపాల్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, లాల్‌కృష్ణ తదితరులు

గొప్ప కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

- తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్ సిరికొండ మధుసుదనాచారి

కవాడిగూడ, మే 17 (ఆంధ్రజ్యోతి): విశ్వంలో జరిగే పరిణామాలను తన దివ్యదృష్టితో ముందుగానే తెలియజేసిన గొప్ప కాలజ్ఞాని శ్రీ పోతూలూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసుదనాచారి కొనియాడారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ మధుసుదనాచారి, బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేషాచారి, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి హాజరై పూలమాలలు వేసి ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా మధుసుదనాచారి మాట్లాడుతూ సమాజంలో ఏ వింత జరిగినా కాలజ్ఞానంలో బ్రహ్మంగారు ఎప్పుడో చెప్పారని ప్రజలు చర్చించుకోవడం గమనించదగిన విషయం అన్నారు. కుందారం గణేషాచారి మాట్లాడుతూ ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే భవిష్యత్‌లో జరిగే అంశాలను విశ్వానికి తెలియచేసిన గొప్ప మహానుభావుడు పోతులూరి వీరబ్రహ్మం అన్నారు.



పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న మాజీ స్పీకర్ మధుసుదనాచారి, తదితరులు

కార్యక్రమంలో రవీంద్రాచారి, లాలుకోట వెంకటాచారి, వేములవాడ మదన్‌మోహన్, మేడం శంకరాచార్య, ఎం కృష్ణమాచార్యులు, విశ్వకర్మ ఫౌండేషన్ సభ్యులు, జంటనగరాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్వకర్మలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 35వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయంలోని శ్రీరాజరాజేశ్వరి స్వామి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయ, శ్రీనాగదేవత, నవగ్రహ దేవతల ఆలయం, వరసిద్ధి వినాయక స్వామి ఆలయ, వల్లిదేసేన సమేత శ్రీసుబ్రహ్మణ్య స్వామి, శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ రాష్ట్ర తొలి శాసనమండలి చైర్మన్ సిరికొండ మధుసూదనచారి, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘాల అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, రాష్ట్ర బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, బీసీ కమిషన్ సభ్యులు డాక్టర్. ఉపేంద్రచారి, డాక్టర్. ఇన్నోజ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ భక్తులకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, తదితరులు

ఆదివాసీ ఉద్యోగులకు

కనీస వేతనం రూ. 35 వేలు ఇవ్వాలి

బర్కత్‌పుర, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉద్యోగులకు కనీస వేతనం 35 వేలు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మరకాల ప్రసన్నకుమారి, కోశాధికారి కందుల ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పీఆర్‌సీ కమిషనర్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలో పనిచేస్తున్న ఆదివాసీ గిరిజన ఉద్యోగులకు అలవెన్స్ గ్రామీణ ప్రాంత ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 20 శాతానికి, వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవ్‌లను 90 నుంచి 180 రోజులకు, పురుష ఉద్యోగులకు కూడా చైల్డ్‌కేర్ లీవ్‌లను 60 రోజులకు పెంచాలని కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, గ్రాట్యుటీ రూ. 30 లక్షలకు పెంచాలన్నారు.



పీఆర్‌సీ కమిషనర్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ ఉద్యోగుల సంఘం నేతలు



రాంనగర్ చౌరస్తా

రాంనగర్ చౌరస్తా జంక్షన్ విస్తరణకు చర్యలు

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన జంక్షన్ల విస్తరణ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో చేసేందుకు చర్యలు చేపట్టింది. ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రధాన కూడళ్లు రాంనగర్ చౌరస్తా, విద్యానగర్ లక్కీ చౌరస్తా, అశోక్‌నగర్ చౌరస్తాలను విస్తరించాలని నిర్ణయించింది. ఈ మూడు చౌరస్తాల మధ్య నుంచి ఎటు 60 ఫీట్లు ఉండేలా రోడ్డు విస్తరణ చేయాలని జీహెచ్‌ఎంసీ భావిస్తుంది. ఇందులో భాగంగా ముషీరాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం మూడు చౌరస్తాలలో జంక్షన్ విస్తరణ కోసం ప్రస్తుతం చౌరస్తాకు ఇరువైపుల ఉన్న కొలతలు తీసుకున్నారు. ఈ కొలతల వివరాలను సర్కిల్ అధికారులు ఉన్నతాధికారులకు వివరిస్తారని టౌన్ ప్లానింగ్ ముషీరాబాద్ సర్కిల్ సెక్షన్ ఆఫీసర్ హఫీజ్ తెలిపారు.

23న అన్నమాచార్య జయంతి

చిక్కడపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాంస్కృతిక సంస్థలు నవ్యనాటక సమితి, అన్నమాచార్యమిషన్‌ల సంయుక్తాధ్వర్యంలో పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 616వ జయంతి మహోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్లు నిర్వాహక సంస్థల ప్రతినిధులు వేమరాజు విజయకుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర నిర్వాహక సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

నేడు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను శనివారం ఉదయం 9 గంటలకు రాంనగర్ డివిజన్‌లోని పవిత్రనగర్‌లో గల ఆర్యవైశ్య భవనం వద్ద నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెనిశెట్టి అరుణకుమార్, నేతి మహేశ్వరి, ఎర్రం రాణి, శ్యామల అపర్ణ, చంద అనితలు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు, కుంకుమార్చన, నవగ్రహపూజ, అమ్మవారికి అభిషేకం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమానికి ఆర్యవైశ్యులు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ 11కేవీ ఫీడర్ పరిధిలోని ఏటీఐ, లైఫ్ ఆస్పత్రి, ఆంధ్రాబ్యాంక్, హోటల్ మేనేజ్‌మెంట్ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో శనివారం ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. సాయిబాబాటెంపుల్, జామై ఉస్మానియా పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు, వైఎంపీఏ పరిధిలో 7 నుంచి 7.30, అయ్యప్ప టెంపుల్, శ్రీరామ్‌నగర్ పరిధిలో 7.30 నుంచి 8 వరకు, ఆప్కో, ఇందిరానగర్ పరిధిలో 8 నుంచి 8.30, పటేల్‌నగర్ పరిధిలో 8.30 నుంచి 9, తిలక్‌నగర్ పరిధిలో 7 నుంచి 9 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.



పురోహితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

సొంత నిధులతో పురోహితులకు జీతాలు అందజేత

గోల్నాక, మే 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలోని 11 దేవాలయాలకు చెందిన పురోహితులకు ప్రతినెల ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన సొంత నిధులతో ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున వేతనం అందజేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. శుక్రవారం గోల్నాక తులసీనగర్ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో 11 మంది పురోహితులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. తమకు ప్రతినెల విధిగా ఆర్థిక సాయం అందజేసి తమకు ఆర్థికంగా ఆదుకుంటూ అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను పురోహితులు ఆశీర్వదించారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

గోల్నాక, మే 17 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ దుర్గానగర్‌లో నివాసం ఉంటున్న వృద్ధ దంపతులైన సత్తయ్య, బాలమణిల ఇంటి నిర్మాణానికి తన వంతుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఇచ్చిన రూ.50 వేల నగదును బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, డివిజన్ వార్డు కమిటీ మాజీ మెంబర్ గండికోట జనార్దన్ సత్తయ్య, బాలమణిల ఇంటికి వెళ్లి అందజేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆపదలో ఉన్న పేదలకు తన వంతుగా ఆర్థిక సహాయం చేస్తూ అండగా నిలుస్తున్నారని గండికోట జనార్దన్ అన్నారు.



రూ. 50 వేల నగదు అందజేస్తున్న గండికోట జనార్దన్



పీఆర్‌సీ చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యోగ సంఘం సెంట్రల్ అసోసియేషన్ సభ్యులు

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

- తెలంగాణ ఉద్యోగ సంఘం

రాంనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): పాతపెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ పీఆర్‌సీ చైర్మన్ శివశంకర్‌కు తెలంగాణ ఉద్యోగ సంఘం సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు మఠం రవీంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి హరీష్‌కుమార్‌రెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, 100 శాతం రుణాలు ఇవ్వాలని, అడ్వాన్స్ పెంచాలని, లీవ్ ట్రావెల్ అలవెన్స్‌ను మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, పెన్షన్ స్ట్రక్చర్, అదనపు పెన్షన్, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఆర్జిత సెలవు జమాపై ఉన్న పరిమితిని ఎత్తివేయాలని పీఆర్‌సీ చైర్మన్‌ను కోరామన్నారు. తమ డిమాండ్లను చైర్మన్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ చైర్మన్ జి. జాకబ్, ఉపాధ్యక్షులు మహేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పద్మ, మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల, సభ్యులు కిషోర్‌కుమార్, రాధాకృష్ణ, నాగరాజు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.